# ప్రబోధం

'సుధ'

అది పెండ్లిరోజు. ఇల్లంతా కిటకిటలాడుతూ వచ్చే పోయే బంధు జనుల గౌరవ మర్యాదలతో సరిపోతోంది. పార్వతి ఏదో అవ్యక్త ఆనందానుభూతిని పొందుతోంది. కాని ఏమో తెలియని భయభీతులు మాత్రం మనస్సులో దట్టంగా కమ్ముకుంటున్నాయి. వచ్చేపోయే బంధు మిత్రులంతా పెండ్లికూతుర్ని చూచి పలుకరించి ఏదో ఆప్యాయంగా మాట్లాడి వెళ్లిపోతున్నారు. కన్యదాతలకే గాక వచ్చిన బంధు జనులకు కూడ ముఖ్యమైన వ్యక్తి పెండ్లి కూతురు. ఈ హడావిడి అంతా ఆమె నిమిత్తమై వచ్చినదేగా!

పార్వతి చిన్న కుగ్రామంలో పెరిగింది. తండ్రి పెద్ద మోతుబరు. కరణీకం, వ్యవసాయం చేసుకొంటున్న సంపన్న గృహస్థు. పైమెట్రిక్ చదువుతో పూర్తిచేసిన విద్యాజ్ఞానం పార్వతిది. బొత్తిగా పల్లెటూరు కావటంవల్ల ఏమాత్రం వైజ్ఞానిక వాతావరణంకాదు. అందువల్ల లలితకళా ప్రవేశానికి కూడా అవకాశంలేకపోయింది. ఏవో పూజపాటల్కు జోలపాటులు మినహా, సినిమా పాటలు కృతులు వగైరా కచ్చేరి పాటలురావు. తొలిచూలు బిడ్డ పార్వతి. తండ్రికి పెండ్లి చేయటం విషయంలో అనుభవములేదన్న మాట. చాలా ఘనంగాను వైభవంగాను చెయ్యాలని మాత్రం అతని వాంఛ. అలుడు చదువుకున్నవాడు. బస్తీవాడు. రూపురేఖలకు లోటు లేదు. మదనుడికైన అశరీరుడన్నలోటువుంది. అలుడు ఉమాకాంతునకదికూడ లోటులేదు. పాదరసంవంటి చురుకైన బుద్ధి. పార్వతికి అన్నివిధాల తగినవాడని నిశ్చయించుకున్నారు.

వెంకటరత్నం ఎడ్వకేటు. బస్తీలో పుట్టి పెరిగిన నవనాగరికుడు. ఎంత నాగరికుడైనా స్త్రీలు చదువుకొంటే సంసారం చెయ్యరనే దృక్పథం గలవాడు. అందుచేత తన ఆడపిల్లలకు ఉన్నత విద్య గఱపింప లేదు. తాను తెచ్చుకొనబోయే కోడలు కూడా సంసార పక్షమైన పైమెట్రిక్ చదువు చదువుకున్నదే. మోతుబరు గ్రామకరణంగారి కుమార్తెను ఉమాకాంతునికి ఖాయం చేసుకొన్నారు.

ఉమాకాంతుడు చదువుకున్న పిల్లను చేసుకోవాలనుకున్నాడు. తన భావినిగురించి విద్యార్థి దశలో ఎవోకలలుకన్నాడు. నాటి ఆశాసౌధాలన్నీ నేడు వమ్మైనాయనుకుంటున్నాడు. రాబోయే కాబోయే ప్రేమ దేవతను గూర్చి ఏమో ఆలోచిస్తున్నాడు. నిజానికి తానంతట తాను మనస్ఫూర్తిగా ఒప్పుకొనలేదు. కాని తండ్రి చెప్పుచేతలలో పెరిగిన వాడు కావటంవల్ల పెళ్ళి విషయంలో పెంకితనం చేయలేకపోయాడు. బి. ఏ. పాసయ్యాడు. మగవాడైతే మాత్రం పెండ్లి విషయంలో అశ్రద్ధ జేస్తారా? 'బెండకాయ ముదిరినా బ్రహ్మచారి ముదిరినా వంగవు' అని సామెత వుండనే వున్నది. అంటే స్త్రీలకే గాక పురుషులకుకూడా వివాహానికి వయఃపరిమాణం వున్నదన్నమాట.

పార్వతి తొలిచూలు బిడ్డగనుక అంతగా పనిపాటలు చేతగావు. చెయ్యవలసిన అవసరం కలుగలేదుమరి. అంటే నిత్యకృత్యాల్లో దైనిక జీవితంలో అవుసరమైన పనులుగూడా పనితనంగా చేయలేదు. జడవేసుకోటం, బట్టలుతకటంకూడా రాదు. ఆమె మనసులో వెళ్లబోయే క్రొత్తయింటి పరిసరాలను గురించి, వాతావరణాన్ని గూర్చిన ఆలోచనలే పెద్దగా చెలరేగుచున్నాయి. ఇంకమీదట తాను కన్యగా ఒంటరిగా వుండబోదు. మిధునంగా ద్వయం కాబోతోంది. తానేపనిచేసినా, ఎట్లా నడుచుకున్నా మరొక వ్యక్తి అభీష్టానికి వ్యతిరేకించకుండా, అభిమానాన్ని, ఆదరణను చూరగొనాలి. తనపలుకు, పని తనకు నచ్చితే చాలదు. మరొకరికి కూడా నచ్చాలి. అది ఆమె జీవితంలో రాబోయే మార్పు. ఒక యువతి ధర్మపత్నియై గృహిణికాబోతోంది.

ఆమెకు పురాణాలలోను, హరికథలలోను, విన్న సీత, సావిత్రి, అనసూయ మొదలైన పతివ్రతల చరిత్రలే ఆదర్శం. తాను తన ఆదర్శ పాతివ్రత్యం ద్వారా భర్తప్రేమను అభిమానాన్ని చూరగొనదల చింది. తన బాల్యమిత్రులను విడిచిపోతున్నందుకు, తల్లిదండ్రులనుండి దూరమౌతున్నందుకు మనసులో బాధ, భయం, విద్యావివేక సంపన్నుడైన ఒక సుందరరూపును పొంద గల్గినందుకొక సంతోషం ఒక అభిమానం పెల్లుబుకుతున్నాయి. లగ్నంనాడు స్నేహితు రాండ్రంతా చుట్టుచేరారు. ఏవో సరస సల్లాపాలు ఆడుకుంటున్నారు. పురోహితుడు వచ్చి పెండ్లికూతు రెక్కడ అంటూ స్నేహితుల మధ్యనుండి పెండ్లికుమార్తెను విడదీసాడు.

పెండ్లి అయింది. యథాప్రకారంగా, విధి యుక్తంగా కార్యకలాపాలు పూర్తియైనాయి. మను గుడుపులకు పెళ్లివారంతా వచ్చారు. పార్వతికి భిడియం హెచ్చు. ఎక్కడో ఒంటరిగానో తనవాళ్ల మధ్యనో కూర్చుండేది. ఉమాకాంతుని నీడపడితే నెమ్మదిగా జారిపోయేది, ఆ పరిసరాలు విడిచి. ఉమా కాంతుని మిత్రులంతా పెండ్లికివచ్చారు. తిరిగి యింటికి వచ్చాక వాళ్లందరకు విందుచేశాడు. మిత్రు లంతా పార్వతి చేత పాటలు పాడించమన్నారు ఉమాకాంతుణ్ణి. పాపం తనకుగాదు తననుగన్న తల్లికి కూడా సాధ్యంకాలేదు. పార్వతి చాలా భయపడట మేగాదు, పాడలేక పోయినందుకు నొచ్చుకుంది. ఆమెకు ఆధునిక దాంపత్య ప్రేమ కలాపాలతో పరిచయంలేదు. ఇదే మొదటి అనుభవం. ఈ విషయంలో భర్తకోర్కెను తీర్చలేక పోయినందుకు తానసమర్థురాలననుకుంది. మొదటి కోర్కె విఫల మైన ఉమాకాంతుడు తనపట్ల ఏవిధంగా ప్రవర్తిస్తా డోనని సందేహిస్తోంది.

ఒంటరిగా గదిలో వుండగా వెళ్లాడు ఉమా కాంతుడు ఏదో పలుకరించాలని. మంచంమీద పడు కొనివుంది. అప్పుడే ఆలోచనల సరికట్టి నిద్రకుప్రక్క మిస్తోంది. ఉమాకాంతు గుమ్మంలోనున్నాడు. పార్వతీ! అన్నాడు చొక్కాతొడుక్కుంటూ! ఉలిక్కిపడిలేచింది భయవిస్మయాక్రాంతయై పైట చెరగు సర్దుకుంటూ లేచీ నిలబడింది తలవంచుకొని. షర్టు సరిచేసికొంటూ గుమ్మంలో నిలబడ్డాడుమా కాంతుడు. వెళ్లటానికి ఉండటానికి గాని పరిస్థితిలో వుంది. ఏంచెయ్యాలో తెలియటంలేదు పార్వతికి. మళ్లీ ప్రశ్నించాడు. "ఏంభయమెందుకు? ఎవరని భయపడుతున్నావు? నీకు పాడటం వచ్చునా? పాడ గలవని అన్నారు మావాళ్లు." అని ప్రశ్నలవర్షం కురిపించి, ప్రశ్నలకు కారణాలు చెప్పాడు.

నిజమే. పాడగలందుకు మంచికంఠమేవుంది. కాని వుపయోగించుకొనేందుకు తగిన వాతావరణంలో పెరిగిందికాదు. ఏవో పూజపాటలు ఆధ్యాత్మ రామాయణకీర్తనలు, మంగళహారతి పాటలవంటివే కాని సినీ పాటలు తాళయుక్తమైన శాస్త్రసంగీతం రావటానికి తగిన అవకాశాలులేవు. ఆ విషయం తెలిసికొని కావాలని కోరితెచ్చుకున్నాడు కలవారి ఆడబడుచును కోడలుగా! ఇప్పుడీవిధంగా ప్రశ్నిస్తే యేం సమాధానం చెప్పగలదు?

పాపం! చివరకు ధైర్యం తెచ్చుకుంది తాత్కాలి కంగా. తలక్రిందుకి దించుకొని భయాన్ని దిగమ్రిం గుతూ "నాకేమివచ్చునో మీకు తెలుసునుగా! తెలి సిన విషయాన్ని నన్నడిగితే నేనేంచెప్పను?" అని తనసమాధానంతో విరమించబోతోంది. "ఇంతేనా నీ గాజుకన్ను గాంభీర్యం" అంటూ వెళ్ళిపోయాడు. పార్వతి క్షతగాత్రయై ఏమీతెలియని వ్యధతో కుమిలిపోతోంది. ప్రథమ సంభాషణలోనేనా ఈ యవమానం. సహించలేక పోయింది మనోవ్యధ. తానెంతగానో వూహించుకొంది ప్రథమ ప్రణయ ప్రస్తావనను. కాని నేడు భగ్నమైంది.

ఉమాకాంతుడు మరునాడు మిత్రులతో షికారు వెళ్లాడు. అచ్చటినుండి సినిమాకు వెళ్లాడు. ఉమా కాంతుని చెల్లెళ్లు వినత, లలితలు సినిమాకు సంసిద్ధులై వున్నారు. ఉమాకాంతుడు యింట్లో వున్న చెల్లెళ్లను క్రొత్త సభ్యురాలు పార్వతిని తీసికొని సినిమాకు వెళ్లాలనుకున్నాడు. కాని భార్యకు ఉన్నతవిద్యా

విజ్ఞానాలు లేవని తనతో తీసికొని వెళ్లటానికి సంశయించి యింటికి రాకుండానే వెళ్లిపోయాడు.

సినీమాకు వెళ్లారైవున్న ముగ్గురు పరిపరి విధాల తలపోశారు. పార్వతి వెంటనే గ్రహించుకొంది. తానెన్నో ఆశాలతలనల్లుకొంది. తను పెరిగింది పల్లెటూరి వాతావరణం. అజ్ఞానతిమిరం. అయినప్పటికి బస్తీవాసం, విద్యా, విజ్ఞాననిలయం దాపోతున్నందుకు సంతోషించింది. ఏవో క్రొత్తవిషయాలు, ఎన్నో తెలుసుకోవగల ననుకుంది. కాని నేడు ఆశాలతలచిగుళ్లే వడిలి పోతున్నాయి.

ఉమాకాంతుడు సినీమానుండి తిరిగివచ్చాడు. పార్వతి ఏదో ఆలోచిస్తూ పడుకొనివుంది. ఏమీ మాట్లాడకుండా చొక్కా విప్పుకొని భోజనం చేశాడు. అన్నయ్య గనుక లలిత అడిగింది "అన్నయ్యా! సినీమాకు తీసికొని వెడతానన్నావు. మమ్మల్ని తీసికొని వెళ్ళలేదేం? ఎంతో సేపు నీకోసం ఎదురు చూచాం. తెలుసా!" అంటూ తన అమాయకత్వం వెలిబుచ్చుకొంది. "ఏదో మా స్నేహితులతో కలిసి వెళ్లిపోయాను. కావలిస్తే రేపు మీరు వెళ్లండి" అని ఉమాకాంతుడు సర్దుకున్నాడు.

పార్వతికి ఎలానడుచుకోవాలో తెలియటంలేదు. ఉమాకాంతుడు నవీన నాగరికత కలవాటుపడ్డాడు. తనకత్యంత సన్నిహితంగా అత్యంత ఆప్తురాలుగా వుండగలదనుకున్న తన ప్రేమపాత్రురాలు గావలసిన భాగ్యదేవత ఎందుకో కొంచెం కొంచెం మనోసామ్రాజ్యానికి దూరం కావలసివస్తోంది. తానెన్నడూ వూహించుకొనలేదు ఈ విధంగా మార్పువస్తుందని. తాను, తన భాగ్యదేవత పూవులో తావిగా, తావిలో మధువుగా, వెన్నెలలో వెల్లులాగా లీనమై రాధామాధవుల ప్రణయగాన మాలాపిద్దామనుకున్నాడు. కాని నేడు తానూహించిన ఆశాసౌధాలు ఒకటొకటిగా కూలుతున్నాయి. తన కేదో ఒక చీకాకు కల్గుతోంది యింటికి వస్తే. మనసిచ్చి కడుపునిండా కబుర్లు చెప్పుకొనేందుకు నోచుకోలేదనుకున్నాడు.

ఒక ఆఫీసుకి యిల్లు అనే త్రాడుతో కట్టబడ్డ జీవిత విధానం వద్దనుకున్నాడు. స్వేచ్ఛావాయువులు పీల్చేందుకు పలుగాకాలైన పట్టణాల వారిని, వారిలా ప్రాంతాలను చూడాలని అందుకు తగిన వృత్తిని ఏదు కోవాలని అనుకున్నాడు. ఏదైనా యంత్రపరిశ్రమను ఏదన్నా తీసికొని దేశంలో చాలభాగం చూడవచ్చునను కున్నాడు.

సైకిళ్లకు, వాటి భాగాలకు వ్యాపారం ప్రారంభించాడు, ఉమాకాంతుడు మరొక మిత్రుడు రవిప్రకాష్‌తో కలసి. అనేక ప్రాంతాలు వ్యాపారాభివృద్ధికొఱకు తిరుగ నారంభించారు. తిన్నవూళ్లో వుండకుండా వున్నవూళ్లో తినకుండా అనేక పట్టణాలు అనేక ప్రాంతాలు తిరిగారు.

మిత్రు లిద్దరిలో ఉమాకాంత్ మంచి కుశాగ్రబుద్ధిగలవాడు. అంతేగాక ప్రాంతీయ భాషలు నేర్చుకొనుటకు తగిన శ్రద్ధ, ఆసక్తిగలవాడు. అందువల్ల తక్కువ వ్యవధిలో ఎక్కువ భాషలు నేర్చుకోగలిగాడు. ఈ ప్రయాణాల్లో ఒకమాటు సేలంనుండి మద్రాసువచ్చే ఎక్స్‌ప్రెస్‌లో మిత్రు లిద్దరు యెక్కారు. కాట్పాడి వరకు వచ్చారు. కాట్పాడిలో దిగి హోటల్‌కు వెళ్ళివచ్చారు.

కాట్పాడిలో ఒక నవనాగరికత తెలిసిన విద్యావంతురాలు వీళ్లున్న పెట్టెలో యెక్కింది. చాలమంది స్త్రీలున్నారప్పటికి. క్రమంగా స్త్రీలు దిగిపోతున్నారు. పురుషులు ప్రవేశిస్తున్నారా పెట్టెలోకి. ఏదో సందర్భంలో ఉమాకాంతు డామెను పలుకరించాడు. ఆమె సమాధానంచెప్పి వూరుకొంది. నెమ్మదిగా కొన్ని సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక విషయాలు చర్చించారు ఆమెతో.

ఆమె పేరు ఉషాదేవి. మద్రాసులో మహిళా సభలో చదువుతున్నది. లలిత కళలలో బాగా ప్రవేశంవుంది. ఐదారు భాషలు వ్రాయను, మాట్లాడను యెరింగిన వ్యక్తి. ఆమె మాతృభాష కన్నడం. కాని తెలుగులోకూడా బాగా పరిచయముంది.

బి. ఏ ప్రైవేటుగా చదువుతోంది. భాషాపరిచయమేగాక వాటి సాహిత్యపరిచయం, కవితా, రచనల పరిచయాలుకూడా వున్నాయి. రూపు రేఖలకు తీర్చి దిద్దినట్లుంటుంది. ఏప్రాంతపు దుస్తులు ధరిస్తే ఆ ప్రాంతీయురాలనిపిస్తుంది. చక్కని కంఠము. కంఠం విప్పితే కోకిలలు శృతివెయ్యాలి - నెమళ్లు నృత్యం చెయ్యాలి. ఆమె యెరుగని వయసులో ఆమెకు పెండ్లికావటం, అది విఫలమై వితంతువగుట జరిగిపోయింది. అదికూడా అక్షరాభ్యాసం కాకమునుపే.

ఆమెలో హైందవత్వం మూర్తీభవించివుంది. ముఖంచూచి బొట్టుపెట్టుకోనవచ్చు. సంస్కృతం పంచకావ్యాలు చదివింది. ఇంతాజేస్తే వయసు యిరువైయొక్క సంవత్సరాలు. ఆమె సౌందర్యానికి ముగ్ధులై ఆమె కన్జూపుల సుధావృష్టికి పరితపించే తృషితులెందరో వున్నారు. కాని నేటి నవనాగరికతలోని అమానుషత్వం ఆమెను ఒక మంత్రముగ్ధగా మార్చివేసింది. ఏమానవుడైనాసరే ఆమె దృష్టిలో ఒక పతితుడుగా కన్పిస్తున్నాడు. ప్రతివ్యక్తి చూపులలోను ఒక కాలుష్యం, ఒక కఠినత్వం గోచరిస్తోందామెకు. అందుకే ఏదో పుస్తకం చదువుతూ, ఏదో చేతిపని, అల్లికపనిచేస్తూ తన దృష్టిని పాపపంకిలమైన ప్రపంచపు దృక్కులనుండి తప్పించుకొంటుంది.

ఉమాకాంతుడు ముగ్గురకు పాలు తీసికొన్నాడు. ఉషాదేవి యిష్టంలేకపోయినా మర్యాదకు లాంఛనప్రాయంగా తీసుకోనక తప్పలేదు. ఉమాకాంతుడు తన అనుభవాలను అనుమానాలను ఒక్కటొక్కటే అడిగి తెలుసుకొంటున్నాడు. స్త్రీలకుండే ప్రతిబంధకాలు, క్లిష్టపరిస్థితులు అనేకం చెప్పింది ఉష. స్త్రీలకు స్వాతంత్ర్యం యిచ్చామంటారు తగిన సావకాశం లేకుండానే. ఇస్తే వుపయోగించుకొనలేని విజ్ఞాను విహీనులను తయారుచేస్తోంది సంఘం. తమకు అక్కచెల్లెళ్లులేరా? వుంటే పరాయి స్త్రీనెందుకలా దృజ్జ్వాలలతో భస్మంచేయ బూనుతారు? హృదయంలేదా? వెర్రిచూపులకు బెదరి లొంగిపోతుందా స్త్రీ? స్త్రీకి తన కర్తవ్యం తెలియదా? పురుషులముగదాయని తమకున్న విజ్ఞానం, వివేకవ్యర్థంగా నాశనం జేసుకొంటారా? ఛీ! పాపిష్టి విద్యాజ్ఞానం! తన తప్పును గుర్తించలేని చదువెందుకు? తన తప్పుకు పశ్చాత్తాపపడని విద్యాజ్ఞానం యెందుకు? అట్లాంటప్పుడు చదువుకున్నామనుకునే నిరర్థక దురహంకార జీవులకంటే పశుపక్ష్యాదులు మేలు, ఒకరికి హానిలేకుండా తమకు తాము జీవిస్తాయి అంటూ ఒక మహోపన్యాసం చేసింది.

రవిప్రకాష్ అర్థంచేసుకుంటున్నాడు. "అయితే మీకు పెండ్లయిందా" అన్నాడు.

"లేదు. నాకీ పాపిష్టిమానవ సంఘాన్నిచూస్తే ఏడుపువస్తుంది. ఎన్నటికైనా కనువిప్పు అనేది వున్నదా సంఘానికి! అని తద్వారా దేశానికి, ప్రపంచానికి భుక్తి ముక్తి వుంటాయి అని తనను తాను పరికించి పరిశీలించుకొంటే యెన్నో లోపాలున్నాయి. అద్దంలో ప్రతిబింబించినట్లు తన హృదయ పలకంపై కన్పించి పలుకరించి కవ్వించేవి, అవి సవరించుకొనటంద్వారా సంఘం, దేశం, ప్రపంచం చక్కబడుతాయి."

"ఇన్ని విషయాలు తెలిసిన మీరు అవివాహితులుగా వుండటానికి కారణం? స్త్రీ సహజంగా సుకుమారంగా సునిశితంగావుండే లతవంటిది. ఆధారం లేక మన లేదీసంఘంలో! చదువుకుని సంఘానికి సేవ చేస్తారా? వివాహం చేసుకొంటారా" అన్నాడుమాకాంత్.

"ముఖ్యంగా ప్రస్తుత కాలంలో సంఘంలోని పెద్ద పిశాచం దహేజ్ - అంటే కట్నాల రివాజు. ఇది రూపుమాసేవరకు సంఘానికి సుభిక్షం దేశానికి కల్యాణం లభించవు. తాను సమర్థుడను భార్యను పోషించగలను, అని ధీమావుంటే కట్నందేనికి? మనోవర్తిలా పుచ్చుకొని నాటకమాడటానికా!" అంటూ సవాల్ చేసింది ఉషాదేవి.

"అయితే ఎదుటి పక్షంనుండి చదువు, సంపద, భూమి, వసతి వున్నాయా అని, వివేకం విజ్ఞానం వున్నాయా అని ఎదురుచూస్తారెందుకు? మీ పక్షం నుండి మీరు దానిని కాంక్షించినప్పుడు వాళ్లు మీ నుండి కట్నం ఆశించటం తప్పుగాదేమో! వినయ విధేయతలు మాత్రం వాంఛించబడుతాయి" అని దహేజ్ రివాజును బలపరచాడు ఉమాకాంత్.

ఆజన్మ బ్రహ్మచారియైన భారత పితామహుడు భీష్మాచార్యుడు అంపశయ్యమీదనుండి ఉత్తమ వైవాహిక లక్షణములనుగూర్చి ధర్మరాజున కిట్లాదేశించాడు.

"కులమును విద్యయు శీలము గల
వానిని పిలిచి ప్రీతి కన్నియ నీగా
వలయునుదక ప్రధాన కవితంబుగ
బ్రాహ్మ కర్మగతి యిది యధిపా!"

ఇది సార్వజనీన సార్వకాలిక మహోత్కృష్ట ధర్మంగా స్వీకరించదగినది. అయితే విద్యాయోగ్యతలుగలవాడు కట్నం అడుగకూడదు. అడిగినట్లైతే అవి లేవన్నమాట" అంది ఉషాదేవి.

"మీ వివాహం మీరే చేసుకొంటారా? తల్లిదండ్రులపై ఆధారపడి వుంటుందా? మీకు నచ్చిన వ్యక్తిని మీరు చేసుకొనగలరా" అని ప్రశ్నించాడు రవిప్రకాష్.

వైవాహిక జీవనమైనా అవివాహిత జీవనమైనా 'మానవసేవ' మానవ కర్తవ్యం! ఫలాపేక్షలేని నిష్కామకర్మ నీచే వాంఛింపబడినప్పుడు నీవొకరి మెడకు ఉరిబోయ నక్కరలేదు. ఉరిబోయించుకో నక్కరలేదు. నీవు నీ పరిసరాలను పరిశుద్ధపరుచుకొని నిన్ను నీవు గుర్తించుకోగల్గినప్పుడు నీకీ ఆటంకాలు కానరావు. నీ యింద్రియాలు నీ ఆధీనంలో వుంటే నీవు యింద్రియాధీనుడవు కాకుంటే నీ అంతరాత్మ ప్రబోధము నీకు స్పష్టంగా వినబడుతుంటే నిన్నీ బాహ్య ప్రపంచంలో ఎదిరించే శత్రువులేదు. నీ తప్పులు నీవు గుర్తించుకో! లోకం యెప్పుడూ నిష్కల్మషమైనదే! నీ దృష్టిలో దోషముంటే నీకు కన్పించే యీ బాహ్య ప్రపంచం దోషభూయిష్టమైనదే అని తలంచకు. అందుకని నిన్ను నీవు అర్థం చేసికో! ఇతరులను విమర్శించి నిన్ను నీవు వంచన చేసికొనకు" అంటూ ఉపదేశాత్మకంగా ఉద్బోధించింది ఉష.

ఆ గుణపాఠంవిని ఉమాకాంత్ ఆమె ఎడ్రసు అడిగి వ్రాసుకొన్నాడు. "మద్రాసులో మిమ్మల్ని కలుసుకోటానికి వీలుంటుందా" అని ప్రశ్నించాడు. ఆమె అంగీకరించింది. ఉష మద్రాసులో దిగింది. రవి ఉమ విజయవాడ చేర్కున్నారు.

రవిప్రకాష్ అవివాహితుడు. వయసు పాతిక వుంటుంది. త్యాగసౌశీల్యాలుగలవాడు. పొడగరి హృదయుడు. ఉషాదేవికి జాబులువ్రాయ నారంభించాడు. తన జీవితంలో ఎదుర్కొనవలసిన క్లిష్ట సమస్యలకు సలహాలు తీసికొంటున్నాడు ఉషాదేవి నుండి. ఆమెలోని స్వచ్ఛ, స్వేచ్ఛా, సేవాభావాలు అతనిలో అంకురించి, చిగిర్చి పుష్పించాయి. సర్వోదయ సిద్ధాంతాలు ఇద్దరిలో బాగా జీర్ణించి వంట బట్టినాయి. పూజ్యబాపూ సేవాభావాలు వీరి హృదయ క్షేత్రాలలో నాటుకొని ఈ విధంగా ఫలోన్ముఖమాతాయని యెవరెరుగుదురు?

ఉమాకాంతునిలో చాలా మార్పు కనుపించింది పార్వతికి. ఏనాడూ కలలోనైనా తన భాగ్య చక్రం మారుతుందని అనుకోలేదు. ఎన్నో నోములు నోచింది. నోముల ఫలమో! ఉషా ప్రబోధమో!!

---